క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు





హైకోర్టు జస్టిస్ శేష సేన, శ్రీనివాసరాజు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేష సేన, ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాస్, సీసీ డైరెక్టర్ నెక్కిన త్రినాథరావు, సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజు వైకుంఠ ద్వార దర్శనంలో వెళ్లి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువుకట్ట మీద వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. శుక్లపక్షం, పుష్యమాసం, పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఓం శక్తి మాలధారులచే ప్రత్యేక పూజలు, భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం ఓం శక్తి మాలధారులు ఇరుముడి దీక్షతో బయలుదేరారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గంగమ్మ సేవలో శ్రీశైలం ఈవో



లవన్న, ప్రతాప్ స్వామీజీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్, ఈవో

తిరుపతి కల్చరల్: శ్రీశైలం ఆలయం ఈవో లవన్న, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ ఆదివారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య అమ్మవారి దర్శనం కల్పించి ఆలయ అర్చకులతో ఆశీర్వాదం అందజేశారు. అనంతరం వారికి ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్, విజిలెన్స్ అధికారి సునీతకు ప్రసాదాలు అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్, విజిలెన్స్ అధికారి సునీత, ఆర్‌టీఐ కమిషనర్ కట్టు జనార్దన్ రావు, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుమారుడు కొట్టు విశాల్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు.

సంక్షేమంలో ఏపీ సరికొత్త రికార్డు

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- గడప గడపలోనూ విశేష ఆదరణ



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం: దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి సరికొత్త రికార్డు సృష్టించారని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుపతి 8వ డివిజన్‌లోని రాయల్‌వీధి, సంజయ్‌గాంధీకాలనీలలో ఆదివారం కార్పొరేటర్ ముని రామిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు మురళి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ప్రజలకు వివరించారు. అయితే అంతకంటే ముందే స్థానికులు ఇప్పటి వరకు లబ్ధి పొందిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్నారు. జగనన్న సంక్షేమ పథకాలతో ఎంతో లబ్ధిపొందామంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ తమకు ఇన్ని సంక్షేమ పథకాలు ఇవ్వలేదని, జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో తమ ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ జగనన్న మూడేళ్లలో ఎంతో మంది పేదల జీవితాలకు వెలుగునిచ్చారని గుర్తుచేశారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో తాము ఏ గడపకు వెళ్లినా నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అనేక సంక్షేమ పథకాలను అందించడంతో పాటు సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నారాయణ, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథరెడ్డి, పార్టీ నాయకులు రవిచంద్ర, గఫూర్, మురళి, రాజేశ్వరి, శారద, శ్యామల, పద్మ, భాస్కర్‌రెడ్డి, గుణభూషణమ్మ, నాదముని, కంకణాల రమేష్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల పోటీలు



టీటీడీ క్రీడా మైదానంలో సంక్రాంతి సంబరాల పోటీల్లో భాగంగా ముగ్గులు వేస్తున్న మహిళలు

తిరుపతి కల్చరల్: నగరంలోని 41వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, కార్పొరేటర్ పి.శ్రవంతి ఆధ్వర్యంలో ఇస్కాన్ రోడ్డులోని క్రీడా మైదానంలో ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, స్లో రేసింగ్ పోటీలు నిర్వహించారు. పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపిక చేశారు. 41వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు, తెలుగు పండుగల విశిష్టతను భావితరాలకు అందించాలనే సంకల్పంతో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పోటీలు చేపట్టామన్నారు. విజేతలకు తాము నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా సండే ఫ్యామిలీ



చర్చి ఆవరణలో వాలీబాల్ ఆడుతున్న యువకులు

పాకాల: స్థానిక సీఎస్ఐ చర్చిలో క్రైస్తవ కుటుంబాలకు సండే ఫ్యామిలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో క్రైస్తవులు పాల్గొన్నారు. యువకులకు వాలీబాల్, మహిళలకు మూజికల్ చైర్స్, త్రోబాల్, చిన్నారులకు పరుగు పందాలు, సీనియర్ సిటిజన్స్ స్పీడ్‌వాక్ వంటి పోటీలను నిర్వహించారు. మధ్యాహ్నం వనభోజనం తరహాలు సామూహిక భోజనాలు చేశారు. క్రైస్తవ కుటుంబాల్లో ఆత్మీయ అందరి మధ్య ఐక్యత, పెంపొందించడానికి తొలసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాస్టర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సాయంత్రం వరకు చిన్నారులు, యువకులు, మహిళలు, వృద్ధులు చాలా సంతోషంగా చర్చిలో గడిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ విక్టర్ రాఘవేలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: తిరుపతి వేదికగా ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహించే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభల విజయవంతాన్ని కాంక్షిస్తూ ఆదివారం బాలాజీ కల్యాణ మండపంలో ఐఎఫ్‌టీయూ సన్నాహక సదస్సు నిర్వహించారు. దీనికి ఆయనతోపాటు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సీనియర్ నేత వెంకటరత్నం, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య, అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఆర్.జ్యోతి, జిల్లా అధ్యక్షురాలు జి.భారతి, ప్రగతిశీల ఆశా వర్కర్స్ జిల్లా వర్కింగ్ అధ్యక్షురాలు జె.గంగాదేవి, ప్రగతి శీల ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు విజయ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆది పాల్గొని జాతీయ మహాసభలపై చర్చించారు. అనంతరం పి.ప్రసాద్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి దగా చేసిందని విమర్శించారు. పలు కార్మిక సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ మహాసభల విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు.

తిరుపతి బస్టాండ్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తం

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్‌లో కొద్దిరోజులుగా ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. బస్టాండ్‌లో నుంచి బస్సును బయటకు తీయాలంటే డ్రైవర్లు నానా ఇక్కట్లు పడుతున్నారు. ప్రధానంగా రాత్రి సమయంలో బస్టాండ్‌లో నుంచి బస్సు బయటకు రావడానికి 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. కొందరు డ్రైవర్లు అడ్డదిడ్డంగా బస్సులను నిలిపేస్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ల మధ్య వాగ్వావాదాలు కొనసాగుతున్నాయి. తీవ్రమైన పదజాలంతో ఒకరినొకరు దూషించుకుంటున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు తమకు సంబంధం లేదన్నట్లుగా చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మహిళలకు ముగ్గుల పోటీలు



తిరుచానూరు: తిరుపతి న్యూ బాలాజీ కాలనీలోని మాపెల్ స్కూల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం తారకరామా స్టేడియంలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మేయర్ డాక్టర్ శిరీష హాజరై విజేతలైన గాయత్రి, దీపకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, సుజిత, తనూజకు తృతీయ బహుమతి అందజేసి అభినందించారు. ఈ పోటీలలో పాల్గొని ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆ స్కూల్ కరెస్పాండెంట్ సి.కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుడా నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం





జగనన్న సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, బోయకొండ గంగమ్మ గుడికి వేస్తున్న సీసీ రోడ్డు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో, తుడా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మండలంలోని 13 పంచాయతీల్లో జగనన్న సమావేశ మందిరాలు, రోడ్లు, భవనాలు, సిమెంటు రోడ్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పంచాయతీ రాజ్ శాఖ డీఈ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి ఆదివారం పనులను పర్యవేక్షించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భాకరాపేట వద్ద బీటీ రోడ్డు నిర్మాణం

మన సంస్కృతిని కాపాడుకుందాం



ఫరీద్‌బాబా దంపతులను కళా బంధువు పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: మన ప్రాచీన జానపద సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలకృష్ణారెడ్డి తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకొని టీటీడీ సహకారంతో, చింతగుంపల రాజేంద్రమ్మ, ఆనంద నాయుడు దంపతుల సౌజన్యంతో మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జానపదం, సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, భక్తి భజన పాటల తోరణం కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ఆయనతోపాటు ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, ప్రజా ఉద్యమ నేత పి.అంజయ్య, ప్రముఖ కథ రచయిత్రి ఎంఆర్.అరుణకుమారి, గూడూరు ఆర్‌డీవో కిరణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పల్లె జీవనానికి పట్టుకొమ్మలైన గొబ్బెమ్మ పాటలు, జానపద గీతాలు, పంబ వాయిద్య విన్యాసాలు అంతరించిపోతున్న కళారూపాలను నేటి తరానికి పరిచయం చేస్తూ ప్రదర్శన చేపట్టడం అభినందనీయమన్నారు. ఇటువంటి కళారూపాలను, కళాకారులను ప్రోత్సహించే దిశగా కళా సంస్థలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కళా రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురిని జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కళాకారులను ప్రోత్సహిస్తూ కళాసేవలు అందిస్తున్న ఫరీద్‌బాబా దంపతులను కళాబంధువు పురస్కారంతో సత్కరించా రు. అనంతరం జానపద, భక్తి సంగీత కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాక ఇతర ప్రాతాల నుంచి వచ్చిన కళాకారులు తమ కళా ప్రతిభా పాటవాలను ప్రదర్శించి అలరింపజేశారు. బంగారుపాళెం పాండురంగ కళానాట్య మండలి వారు ప్రదర్శించిన ద్రౌపది వస్త్రాపహరణం నాటకం, కడప వారిచే ప్రదర్శించిన బ్రహ్మంగారి జీవిత చరిత్ర సభికులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ కార్యక్రమంలో మన సంస్కృతి కళా సంస్థ గౌరవాధ్యక్షుడు గంగిరెడ్డి, అధ్యక్షుడు సహదేవనాయుడు, కార్యదర్శి కె.రెడ్డెప్ప, విశ్రాంత ప్రిన్సిపాల్ నారాయణస్వామి, హరినాయుడు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, ఆమూరి సుబ్రమణ్యం, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు పురుషోత్తం నాయుడు, కలువగుంట రామమూర్తి, గొల్లా పిన్ని సుబ్రమ ణ్యం, అరసం కార్యదర్శి యువశ్రీ మురళి, రచయిత సురేంద్ర పాల్గొన్నారు.

యువతదే క్రియాశీల పాత్ర

తిరుపతి కల్చరల్: దోపిడీతనం పోవాలంటే కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలక పాత్రను యువత పోషించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ సైద్ధాంతిక శిక్షణా తరగతుల్లో రెండో రోజు దేశ రాజకీయాల్లో యువత ఏ పద్ధతిలో ముందుకెళ్లాలి అనే అంశంపై ఆయన మాట్లాడారు. 1848లో కారల్ మార్క్స్ రచించిన కమ్యూనిస్టు మేనిఫెస్టో స్ఫూర్తితో అనేక దేశాలలో విప్లవోద్యమాలు నడిచాయని గుర్తు చేశారు. భారతదేశంలో భగత్ సింగ్, రాజు గురు, సుఖదేవ్ హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ పేరుతో సొంత సైన్యాన్ని నిర్మించి విప్లవ కార్యాచరణకు పూనుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, తరుణ్, నాగార్జున, కార్తీక్, షణ్ముగం, మహేంద్ర, పురుషోత్తం, సునీల్, వినయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలబార్‌లో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన



వజ్రాభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్ పద్మజ, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో మైన్ డైమండ్ షో పేరుతో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన ఆదివారం ప్రారంభమైంది. దీన్ని మదర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పద్మజ ప్రారంభించారు. షోరూం హెడ్ రజీష్ మాట్లాడుతూ నిత్యం సరికొత్త డిజైన్లలో బంగారు ఆభరణాలు అందిస్తూ మన్ననలు అందుకుంటున్న తాము వినియోగదారుల కోసం ప్రత్యేకంగా మైన్ డైమండ్ షో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 12వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఇందులో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నామని తెలిపారు.

విశేషమైన వైద్యం.. అసలైన ఆరోగ్యం

ఆ..పీహెచ్‌సీకి ఏం వెళతాంలేబ్బా అనే స్థాయి నుంచి ఈ పీహెచ్‌సీకి ఏం వెళుతున్నారబ్బా అనే స్థాయికి చేరుకుంది మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. పేరుకే పీహెచ్‌సీ కానీ లోపలికి వెళ్లి చూస్తే ప్రైవేటు ఆస్పత్రి కూడా అలా ఉండదు. ఇక్కడ మందులు, సదుపాయాలకు కొదవ లేదు. పడకల కొరత లేదు. వైద్య సిబ్బంది పోస్టులు ఖాళీ ఉండవు. అత్యవసర వైద్య సేవలకు లోటు లేదు. రూపాయి ఖర్చు పెట్టక్కర్లేదు. ఆరోగ్యానికి ఢోకా ఉండదు. రోగులకు బాధ లేదు. ఆహ్లాదానికి, పరిశుభ్రతకు చిరునామాగా వెలుగొందుతున్న ఈ పీహెచ్‌సీ గురించి తెలుసుకుందాం.



రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు స్రవంతి, జయంతి

- మెరుగైన వైద్యానికి చిరునామా
- ఆహ్లాదకర వాతావరణంలో వైద్య సేవలు
- ఆరోగ్య ప్రదాయినిగా మంగళం పీహెచ్‌సీ

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విశేషమైన వైద్య సేవలు అందిస్తోంది. పేరుకు అది ప్రాథమిక వైద్య శాల అయినా అన్నిరకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ సహకారంతో పెద్దాస్పత్రి తరహాలో రోగులకు అత్యవసర సేవలందించేందుకు నిపుణులైన వైద్యులు, టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది పనిచేస్తూ ఉంటారు. మెరుగైన వైద్య సేవలందిస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు.

పల్లె ప్రజలకు అండగా..

నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంగళం పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలందిస్తోంది. తిరుపతి నగర శివారు ప్రాంతాల్లో నివశిస్తున్న వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉంది. 2011లో మంగళం సమీపంలోని సప్తగిరికాలనీలో ఆస్పత్రిని ఒక చిన్న రేకుల షెడ్డులో ఏర్పాటు చేశారు. అప్పట్లో తిరుపతి అర్బన్, రూరల్ మండలాలతో పరిధిలోని పంచాయతీలతోపాటుగా తిరుమలకు దీన్ని అనుసంధానం చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు వైద్యసేవలందించారు. అయితే రూరల్ మండలం పరిధిలో వైద్యసదుపాయాలు అందుబాటులోకి వచ్చిన తరువాత, ఇప్పుడు అర్బన్ మండలం పరిధి, తిరుమల పరిధిలో నివశించేవారికి వైద్య సేవలందుతున్నాయి. ఆస్పత్రిలో నిత్యం వందమందికి పైగా వైద్యసేవలు పొందుతూ ఉంటారు. ఈ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తూ పేద ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. గతంలో అత్యవసర పరిస్థితుల్లోనైనా, కనీసం జ్వరమొచ్చినా నగరం వైపు రోగులు పరుగులు పెట్టాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు అన్ని రకాల సదుపాయాలతో సేవలందిస్తున్న కారణంగా పల్లెజనం ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇద్దరు నిపుణులైన వైద్యులు, 12 మంది వైద్య సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారు. అంతేకాకుండా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ల్యాబ్, టీబీ రోగుల యూనిట్, బాలింతల వార్డు, ఫిజియోథెరపీ వార్డు అందుబాటులోకి వచ్చాయి.

ఇంటి వద్దకే వైద్యం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించిన విధంగా ప్రతి పేదవారికి ఇంటి వద్దకే వెళ్లి వైద్యులు వైద్యం అందిస్తున్నారు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు స్రవంతి, జయంతి ఉన్నారు. వారితో పాటు 12మంది వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. మంగళంలోని నాలుగు పంచాయతీలతో పాటు తిరుపతి రూరల్ మండలంలోనూ వీరు అత్యవసర పరిస్థితుల్లో ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు.



ఉచితంగా మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

పరిశుభ్రం, ఆహ్లాదకరం

ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలందిస్తున్నారు. అందులోనూ పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం రోగులకు ఉపశమనం కల్పిస్తోంది. దానికి తోడు పీహెచ్‌సిలోని వైద్యుల నుంచి నర్సుల వరకు రోగుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ, చిరునవ్వుతో పలకరిస్తున్నారు. దీంతో సగం జబ్బు నయం అయిపోతోందని రోగులే చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బు ఖర్చు పెట్టినా అందని వైద్యం ఇక్కడ ఉచితంగా అందుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



మంగళం పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇన్ఫెక్షన్స్ కలగకుండా పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాం. దాంతో పాటు బాలింతలు డెలివరీ సమయం వరకు అవసరమైన వైద్యసేవలు అందించి, ప్రతి బుధ, శనివారాల్లో తిరుపతి ఉమెన్స్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రోజు వందమందికి పైగా రోగులు వస్తున్నారు. వారి భద్రత కోసం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశాం. రోగులకు వైద్యం అందించి, ఉచితంగా మందులు అందిస్తున్నాం.

\- డాక్టర్ స్రవంతి, మంగళం పీహెచ్‌సీ